www.prajasakti.com

ప్రజాశక్తి

సోమవారం 16 డిసెంబర్ 2024



నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30న సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

ప్రమాదంలో స్వేచ్ఛ, సామాజిక న్యాయం

- వ్యవస్థల వైఫల్యంతోనే 'సాయిబాబా' మృతి
- ఇష్టానుసారంగా ఉపా, రాజద్రోహం కేసులు
- 'చట్టం అందరికీ సమానమేనా' సదస్సులో విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్



సదస్సులో మాట్లాడుతున్న విశ్రాంత ప్రొఫెసర్ హరగోపాల్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

దేశం ఫాసిజానికి దగ్గరవుతోందని, అభ్యుదయవాదులు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ప్రముఖ విశ్రాంత అధ్యాపకులు, పౌరహక్కుల వేత్త హరగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన కడప నగరంలోని హరిత్ హోటల్‌లో వామపక్ష ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రముఖ న్యాయవాది బొగ్గుల గుర్రప్ప అధ్యక్షతన నిర్వహించిన 'ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబా స్మృతి..చట్టం అందరికీ సమానమేనా ' అంశంపై ప్రధాన వక్తగా హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో స్వేచ్ఛా, సమానత్వం, సౌభ్రాతృత్వం, సామాజిక న్యాయం ప్రమాదంలో పడ్డాయన్నారు. రాజ్య స్వభావం మారేకొద్దీ పోరాటాలు పెరుగుతాయనే సంగతిని గుర్తించుకోవాలన్నారు. నిరాధారమైన ఆరోపణలతో ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబాను పదేళ్లపాటు జైలులో పెట్టి, ఆయన విలువైన సమయాన్ని బలి తీసుకున్నారని విమర్శించారు. విశ్వవిద్యాలయ, న్యాయ వ్యవస్థ, జైలు వ్యవస్థల వైఫల్యం కారణంగా జి.ఎన్ మృతి చెందారన్నారు. తెలంగాణాలోని ములుగు కేసులో నిరాధార మైన ఆరోపణలతో 150 పేర్లు చేర్చారన్నారు. అప్పటి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తే తనతో సహా ఆరుగురు న్యాయవాదులను తొలగించి, మిగిలిన వారిని కేసులో ఉంచారన్నారు. వీరిలో బాంబే హైకోర్టు జడ్జి సురేష్ పేరును మూడు చోట్ల చేర్చారని, అప్పటికే ఆయన చనిపోయారా వాపోయారు. ప్రొఫెసర్ జిఎన్‌ను విడుదల కావడం, మరుసటి రోజు అరెస్టు చేయడం, ఆర్ణబ్‌గోస్వామి ఉదయం అరెస్టు, సాయంత్రం బెయిల్ ఇవ్వడాన్ని చూస్తే దేశంలో చట్టం అందరికీ సమానమే ఎలా అవుతుందో ఆలోచించుకోవాలన్నారు. రాజ్యాంగాన్ని పాలకులే బద్దలు కొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఎన్ శారీరక వైకల్యంతోపాటు, సామాజిక రుగ్మతలపైన చివరి శ్వాస వరకు అలుపెరుగని పోరాటం చేశారని, ఆయన స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని సామాజిక రుగ్మతలను రూపుమాపడానికి కంకణం కట్టుకోవాలని చెప్పారు. అర్బన్‌నక్సల్స్ పేర్ల జాబితాలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ చేర్చడం పాలకుల వైఖరి తేటతెల్లమైందని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు రాంభూపాల్ మాట్లాడుతూ ఇటీవల ఢిల్లీలో మణిపూర్‌కు చెందిన ఎనిమిది మంది బిజెపి కుకీ ఎమ్మెల్యేలు నిరసన ర్యాలీ నిర్వహించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోందన్నారు. ప్రొఫెసర్ జిఎన్‌కు రెండు సార్లు బెయిల్ వచ్చినప్పటికీ, వెంటనే అరెస్టు చేయడం దేనికి సంకేతమో ఆలోచించాలని సూచించారు. 1891 నుంచి 1947 వరకు 124 (ఎ) సెక్షన్ కింద బ్రిటిష్ ప్రభుత్వం 347 రాజద్రోహం కేసులు నమోదు చేయగా, మోడీ పదేళ్ల పాలనలో 548 మందిపై రాజద్రోహం కేసులు నమోదు చేసిన ఘనత ఆయనకే దక్కిందని పేర్కొన్నారు. హత్రాస్ ఘటన కవరేజికి వెళ్లిన సిద్ధిఖ్‌కప్పన్ జర్నలిస్టును 712 రోజులు జైలులో నిర్బంధించారన్నారు. అంతకు ముందు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర, రవి ప్రసంగించారు. చివరగా పిహెచ్‌డి స్కాలర్ మల్లెల భాస్కర్ వందన సమర్పణ చేశా రు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ నాయకులు కుళాయిస్వామిరెడ్డి, ప్రముఖ వైద్య నిపు ణులు ఓబుల్‌రెడ్డి, రాజావెంగల్‌రెడ్డి మహేశ్వరరెడ్డి, ప్రజా సంఘాల నాయకులు ఎల్‌ఐసి యూనియన్ నాయకులు రఘునాథరెడ్డి, రామ్మో హన్, శ్రీనివాసులరెడ్డి, వందలాది మంది మేధావులు, ప్రజా సంఘాల నాయకులు, వివిధ రంగాలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించడమే లక్ష్యం

జిల్లా విద్యాశాఖాధికారి సుబ్రహ్మణ్యం



ముఖా ముఖి..

ప్రజాశక్తి- రాయచోటి

జిల్లాలో ఉపాధ్యాయులకు, విద్యార్థులకు అందుబాటులో ఉండి పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలు సాధించడమే తమ లక్ష్యమని జిల్లా విద్యాశాఖ అధికారి సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లాల్లో ఉపా ధ్యాయులు, విద్యార్థులు వివరాలు, పాఠశాలల్లో వసతులు, విద్యార్థులకు బోధన వంటి అంశాలపై ప్రజాశక్తికి ఇచ్చిన ముఖా ముఖిలో ఆయన వివరించారు.

జిల్లాలో డిప్యూటీ డిఇఒ, ఎంఇఒ, ఉపాధ్యాయుల వివరాలు తెలపండి?

జిల్లాలో డిప్యూటీ డిఇఒలు ఇద్దరు ఉన్నారు. రాయచోటి, మదనపల్లె ప్రాంతాలలో ఉన్నారు. 30 మండలాలలో మొత్తం 58 మంది మండల విద్యాశాఖ అధికారులు ఉన్నారు.7,678 మంది ఉపాధ్యాయులు ఉన్నారు.

జిల్లాలో పాఠశాలలు, విద్యార్థుల వివరాలు తెలపండి ?

జిల్లా వ్యాప్తంగా 2,210 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. 545 ప్రయివేట్ పాఠశాలలున్నాయి. ప్రాథమిక పాఠశాలలో 192, యుపి 132, హై స్కూల్ 216 పాఠశాలలున్నాయి. 24,4008 మంది మొత్తం విద్యార్థులున్నారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలలో 1,35,472 మంది ఉన్నారు. ప్రయివేట్ పాఠశాలల్లో 1,08,536 మంది విద్యార్థులున్నారు.

ఏడాదిలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, కిట్లు పూర్తిస్థాయిలో అందజేశారా?

ఈ ఏడాదిలో జిల్లా వ్యాప్తంగా విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, కిట్లు పూర్తిస్థాయిలో అందజేస్తున్నాని చెప్పారు.

తల్లికి వందనం వర్తించాలంటే విద్యార్థులకు ఎలాంటి అర్హత ఉండాలి?

విద్యార్థులకు హాజరు 75 శాతం తప్పనిసరిగా ఉండాలి. రేషన్ కార్డు తప్పనిసరిగా ఉండాలి.

జిల్లాకు తల్లికి వందనం ఎంత బడ్జెట్ అవసరమవుతుంది?

జిల్లావ్యాప్తంగా తల్లికి వందనంకు సంబంధించి 2,73,619 మంది విద్యార్థులు ఉన్నారు. రూ. 410.43 కోట్లు బడ్జెట్ కావాల్సి ఉంది. రైల్వేకోడూరు లో 40929 మంది విద్యార్థులు ఉండగా రూ.61.39 కోట్లు, మదనపల్లిలో 56,411 మంది విద్యార్థులు ఉండగా రూ.84.62 కోట్లు, పీలేరులో 44,774 విద్యార్థులు ఉండగా రూ .67.16, రాజంపేటలో 37,438 మంది విద్యార్థులు ఉండగా రూ.56.16 కోట్లు, రాయచోటిలో 60,149 మంది విద్యార్థులు ఉండగా రూ.90.22 కోట్లు, తంబళ్లపల్లె 33,919 విద్యార్థులు ఉండగా రూ.50.88 కోట్లు కావలసి ఉంది.

అధిక ఫీజు వసూళ్లపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జిల్లాలో ప్రయివేట్ పాఠశాలల్లో ఫీజులు, పాఠ్యపుస్తకాలు అధిక ఫీజులు వసూలు చేస్తే, అలాంటి పాఠశాలలపై విచారించి తగు చర్యలు తీసుకుంటాం.

జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఏమైనా ఉందా?

జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయులు కొరత లేదు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించడానికి తీసుకుంటున్న చర్యలు?

10వ తరగతిలో ఫలితాలలో 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేస్తున్నాం. విద్యార్థులకు 10వ తరగతి విద్యార్థులకు స్పెషల్ క్లాసులు నిర్వహిస్తున్నాం. వారికి స్పెషల్ స్టడీస్‌ను కూడా నిర్వహిస్తున్నాం. పరీక్షలు త్వరలో ఉన్నందున ఎలాంటి సమస్యలు తావు లేకుండా క్రమశిక్షణతో ప్రణాళికాబద్ధంగా నూరు రోజుల యాక్షన్ ప్లాన్‌ను పూర్తి చేసి 100 శాతం ఉత్తీర్ణత సాధించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

విద్యార్థులకు సలహాలు సూచనలు ఏమైనా ఇవ్వాలనుకుంటున్నారా?

ప్రతి విద్యార్థీ క్రమం తప్పకుండా రోజూ పాఠశాలకు హాజరు కావాలి. ప్రతి ఒక్కరూ ఉపాధ్యాయుల సూచనలను పాటించి అన్ని పాఠ్యాంశాలను శ్రద్ధగా విని ఎప్పటికప్పుడూ పాఠ్యాంశాలను చదువుకోవాలి. ప్రతి విద్యార్థి పరిశుభ్రతను పాటించి ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి.

కడప ఉక్కుపై కపట నాటకం

- ఫిబ్రవరి నుంచి ఉక్కుపై ఉద్యమం
- టిడిపి, జనసేన వైఖరిని స్పష్టం చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాంభూపాల్ వెల్లడి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న రాంభూపాల్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాయలసీమ డిక్లరేషన్ పేరుతో నాటకాలాడిన బిజెపి రాయ లసీమ ద్రోహిగా మారిందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు రాం భూపాల్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈసం దర్భంగా ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ అమలు విషయంలో సెయిల్, నాణ్యత పేర్లతో కపట నాటకం ఆడుతోందన్నారు. కేంద్రబడ్జెట్‌లోనూ ఎటువంటి కేటాయింపులు చేయ కుండా చోద్యం చూస్తోందని విమర్శించారు. కేంద్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం టిడిపి మద్దతుతోనే కొనసాగుతోందని, ఇటువంటి సమయంలో టిడిపి, జనసేన పార్టీలు కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు హామీ పట్ల స్పష్టత రాబట్టుకోవాలన్నారు. ఇటీవల కేంద్రమంత్రి కుమారస్వామి పరిశీలనలో లేదని చెబితే ఎటువంటి నిరసన వ్యక్తం చేయని వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు ఎవరికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయో చెప్పాల్సి ఉందన్నారు. రాష్ట్రం లోని పరిస్థితులను ఆసరా చేసుకుని కేంద్రం ఇష్టానుసారంగా వ్యవ హరిస్తోందని విమర్శించారు. గత ఎన్డీయే ప్రభుత్వంతో టిడిపికి బంధం తెగగానే చెరో వైఖరితో సీమను మోసం చేశాయన్నారు. బిజెపి నాణ్యత, ఫీజుబిలిటీ పేరుతో, టిడిపి పార్లమెంట్ సభ్యులు సిఎం రమేష్‌ను నిరాహారదీక్షకు పురమాయించి నాటకాలు ఆడాయన్నారు. ప్రస్తుతం ఎంపీ సిఎం రమేష్ బిజెపిలో ఉంటూ ఎందుకు నోరు మెదపడం లేదని నిలదీశారు. వలసలు, రోడ్డుప్రమాదాలు, వ్యవసాయ కూలీలు, కరువు కాటకాలతో దేశంలోనే వెనుక ప్రాంతమైన రాయల సీమలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు చేయ డానికి 14 ఏళ్లు తీసుకుంటాయా అంటూ ఉద్వేగంతో ప్రసంగి ంచారు. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడపలో ఉక్కు పరిశ్రమ ఏర్పాటు అంశంపై టిడిపి, జనసేన స్పష్టమైన వైఖ రులు ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఫిబ్రవరి ఒకటి, రెండు, మూడు తేదీల్లో నెల్లూరు జిల్లాలో నిర్వహించనున్న సిపిఎం రాష్ట్ర మహాసభల్లో కడప ఉక్కు ఉద్యమంపై స్పష్టత ఇస్తామని తెలిపారు. ప్రతిపక్ష స్థానంలో ఉన్న వైసిపి నిబద్ధ తతో కూడిన రాజకీయాలు చేయాలన్నారు. కాంక్రీట్‌గా వ్యవహరి ంచాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, రామ్మోహన్, మనోహర్, అన్వేష్, కామనూరు శ్రీనివా సులరెడ్డి, శివకుమార్ పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డిఆర్‌ఒ మధుసూదన్‌రావు

ప్రజాశక్తి- రాయచోటి

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిదని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు తన ప్రాణాలను త్యాగం చేసిన రోజు (ను ఆత్మార్పణ దినోత్సవంగా జరుపుకుంటున్న సందర్భంగా అన్నమయ్య జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదన్‌రావు, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్‌ఒ మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఒక గొప్ప త్యాగ మూర్తి, భాషా ప్రయుక్త రాష్ట్రాల కోసం పోరాటం చేసిన ఆద్యుడని కొనియాడారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 1901 మార్చి 16న జన్మించి 1952 డిసెంబరు 15న అమరులయ్యారన్నారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించి, అమరజీవి మహాపురుషుడని, ఆయన త్యాగ ఫలితమే, కర్నూలు రాజధానిగా ఆంధ్ర రాష్ట్రం 1953 అక్టోబర్ 1న ఏర్పడిందన్నారు. అనంతరం, తెలంగాణ ప్రాంతంలో తెలుగు మాట్లాడే జిల్లాలను కలిపి 1956 నవంబర్ 1న ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ఏర్పడిందన్నారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస, హరిజనోద్ధరణ తదితర ఆశయాల కోసం జీవితాంతం కృషిచేసిన మహనీయుడన్నారు. ఇటువంటి మహనీయుల జీవితం నుండి స్ఫూర్తి పొంది యువత సన్మార్గంలో, దేశ భక్తితో మెలగాలని కోరారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో నాగభూషణం,కలెక్టరేట్ సిబ్బంది, వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు ప్రాధాన్యత కల్పించాలి



సీఎం చంద్రబాబుకు వినతి పత్రం ఇస్తున్న సుబ్రమణ్యంరెడ్డి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నామినేటెడ్ పదవుల్లో విభిన్న ప్రతిభావంతులకు తగిన ప్రాధాన్యత కల్పించాలని విజయవాడలోని టిడిపి కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకి టిడిపి అన్నమయ్య జిల్లా విభిన్న ప్రతిభావంతుల విభాగం అధ్యక్షులు ఆర్.సుబ్రహ్మణ్యం రెడ్డి ఆదివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం రెడ్డి మాట్లాడుతూ దివ్యాంగుల పెన్షన్‌ను రూ.6 వేలకు పెంచి వారి గౌరవాన్ని పెంచిన ఘనత సిఎం చంద్రబాబుకే దక్కుతుందని అన్నారు. అదే తరహాలో నామినేటెడ్ పదవులను కేటాయించి ప్రాముఖ్యత కల్పించాలన్నారు. ముఖ్యంగా మదనపల్లి టమోటో మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ పదవిని టిడిపి విభిన్న ప్రతిభావంతుల విభాగానికి కేటాయించాలని కోరగా అందుకు సిఎం సానుకూలంగా స్పందించారన్నారు. టిడిపి విజయంలో విభిన్న ప్రతిభావంతుల పాత్ర ఉందన్నారు. ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, శాప్ చైర్మన్ రవినాయుడుని కలిసి విభిన్న ప్రతిభావంతులకు నామినేటెడ్ పదవుల ఆవశ్యకతను వివరించినట్లు తెలిపారు. వారందరూ సానుకూలంగా స్పందించి తమ మద్దతు కచ్చితంగా ఉంటుందని హామీ ఇచ్చారన్నారు.

'గంగనపల్లి'కి ఘన సత్కారం

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్



జ్ఞాపికను అందుకుంటున్న గంగనపల్లి వెంకటరమణ

రాయలసీమ సాంస్కృతిక వేదిక, వేమన అధ్యయన, అభివృద్ధి కేంద్రం వారి సంయుక్త ఆధ్వర్యంలో అనంతపురం ఎస్‌ఎస్‌బి ఎన్ కళాశాల ఆడిటోరియంలో 8వ రాయలసీమ మహాకవి సమ్మేళనంలో రాజంపేట పట్టణానికి చెందిన తెలుగు పండితులు, తెలుగు భాషా సంరక్షణ సమితి జిల్లా సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ పాల్గొని కవితా గానం చేసి ఘన సత్కారం అందుకున్నారు. ఆయన "రాయలసీమ సాహితీ రత్నం కట్టా నరసింహులు' అనే అంశంపై పంచ పద్య రత్నాలను వినిపించారు. ఈ సందర్భంగా కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి, రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షులు బొజ్జా దశరథరామిరెడ్డి, ప్రముఖ రచయిత, నవలాకారుడు శాంతి నారాయణ, ప్రముఖ కథా నవలా రచయిత బండి నారాయణస్వామి చేతుల మీదుగా ఘన సత్కారం అందుకున్నారు. శాలువా, జ్ఞాపిక, ప్రశంశాపత్రాలతో వారు గంగనపల్లి వెంకటర మణను సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, జల సాధన సమితి అధ్యక్షులు రామ్ కుమార్ రెడ్డి, ప్రముఖ కథా, నవలా రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి, వామపక్ష పార్టీ నాయకులు లోచర్ల విజయభాస్కర్ రెడ్డి, భారత్ ప్రజా రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి, జనప్రియ కవి ఏలూరి వెంగన్న, మానవత రక్తనిధి అధినేత తరిమెల అమరనాథ రెడ్డి, అనంత పురం జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు జన్నే ఆనంద్, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలి

ప్రజాశక్తి-వాల్మీకిపురం

ప్రకృతి వ్యవసాయంపై రైతులు మొగ్గు చూపాలని జూనియర్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ పవన్ అన్నారు. జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ప్రవీణ్ ఆదేశాల మేరకు ఆదివారం మండలంలోని చింతలవారిపల్లిలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘన, ద్రవ జీవామృతం తయారీ చేసి పంటలకు వేయడం వలన పంట మంచి దిగుబడి వస్తుందన్నారు. అంతే కాకుండా ప్రకృతి వ్యవసాయ పంటల ద్వారా వచ్చే ఆహారం తీసుకోవడం వలన ఎలాంటి కల్తీలు లేకుండా నాణ్యతగల ఆహారం లభిస్తుందన్నారు. రైతులందరూ ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపాలని, ప్రకృతి వ్యవసాయంలో పండిన పంటలకు మార్కెటింగ్ సౌకర్యం కూడా ఉందన్నారు. అనంతరం వెయ్యి కిలోల ఘన జీవామృతం, 400 లీటర్ల ద్రవ జీవామృతంను సామూహికంగా తయారు చేసి చూపించారు. కార్యక్రమంలో సిబ్బంది హేమలత, పెద్ద రెడ్డెయ్య, సుబ్బరామయ్య, రైతులు పాల్గొన్నారు.



రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న పవన్



సుగవాసి, ఎస్.వి రమణలను సన్మానిస్తున్న గ్రామస్తులు

క్రికెట్ పోటీలు అభినందనీయం : 'సుగవాసి'

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని ఊటుకూరులో టిడిపి నాయకులు బాలసుబ్రమణ్యం గీతాంజలి ప్రీమియర్ లీగ్ సీజన్-3 పోటీలను ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన బాలసుబ్రమణ్యంను గ్రామస్తులు మేళతాళాలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన రిబ్బన్ కట్ చేసి క్రికెట్ పోటీలను ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్.వి.రమణ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఎస్‌వి.రమణ మాట్లాడుతూ పోటీలో గెలుపొందిన వారికి మొదటి బహుమతిగా రూ 50 వేలు, ద్వితీయ బహుమతి రూ.30 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. యువత క్రీడలలో రాణించి మన ప్రాంతానికి, దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి లీగల్ సెల్ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, ఊటుకూరు చెరువు సంఘం అధ్యక్షులు నామా హరినాథ్, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, టిడిపి నాయకులు సుధాకర్ రెడ్డి, కె.ఎస్ నరసింహ, మాజీ సర్పంచ్ మన్నేరు లక్ష్మీనరసయ్య, నారాయణ, సంజీవరావు, కొండయ్య నాయుడు, సంభావు వినయ్, వెంకటేశ్వర్లు నాయుడు, అబ్బిగారిగోపాల్, వెంకటరమణ పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కండి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మంత్రి నారా లోకేష్‌ను కలిసిన లోకేష్ కొణిదెల

ఆంధ్రప్రదేశ్ అభి వృద్ధిలో టిడిపి ఎన్‌ఆర్‌ఐ విభాగం భాగస్వామ్యం కావాలని ఎన్‌ఆర్‌ఐ నాయకులు, మదనపల్లెకు చెందిన లోకేష్ కొణిదెలకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఆదివారం విజయవాడలో లోకేష్‌ను కొణిదెల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారా లోకేష్ మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వ విధానాలతో అభివృద్ధిలో ఎపి పూర్తిగా వెనుకబడిపోయిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని చక్కదిద్దే పనిలో పడిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వాతావరణం సృష్టించడంతో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయని అన్నారు. అనంతరం ఎన్‌ఆర్‌ఐ లోకేష్ కొణిదెల మాట్లాడుతూ ఇటీవల మంత్రి నారా లోకేష్ అమెరికా పర్యటన దిగ్విజయం కావడం రాష్ట్ర అభివృద్ధికి సంకేతమన్నారు. ఎపికి పెద్ద ఎత్తున పెట్టు బడులు తీసుకొచ్చేందుకు టిడిపి ఎన్‌ఆర్‌ఐ విభాగం చేస్తున్న కృషిని మంత్రికి వివరిం చిన ట్లు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి తమ సంపూర్ణ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, సిఎం చంద్రబాబు ఆధ్వర్యంలో ఎపి అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడుస్తోందని పేర్కొన్నారు.



మంత్రికి స్వాగతం పలుకుతున్న నిర్వాహకులు

మంత్రిచే ఉచిత వైద్య శిబిరం ప్రారంభం

ప్రజాశక్తి- రాయచోటి

పట్టణంలోని బెతల్ కాలనీలో ఉన్న వెంకటేశ్వరస్వామి హైస్కూల్‌లో 'మా వెల్ఫేర్ సొసైటీ'వారు ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆదివారం రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సొసైటీ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం ఎంతో శుభ పరిణామమన్నారు. ఈ ప్రాంతంలోని ప్రజలందరూ ఉచిత మెగా వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన వైద్యం పొందాలని సూచించారు. మా వెల్ఫేర్ సొసైటీ వారు గతంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని రాబోయే రోజులలో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి పేదలకు సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో పలువురు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిడిపి సభ్యత్వంతో కుటుంబానికి భరోసా

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

టిడిపి సభ్యత్వంతో కార్యకర్తల కుటుంబానికి భరోసా లభిస్తుందని టిడిపి నాయకులు బోనాసి జాన్‌బాబు పిలుపునిచ్చారు. ఆదివారం నీరుగట్టువారిపల్లె చౌడేశ్వరి సర్కిల్‌లో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జాన్ బాబు మాట్లా డుతూ ఎమ్మెల్యే షాజహాన్ బాషా సూచనల మేరకు నెల రోజులుగా సభ్యత్వ నమోదు ప్రక్రియను కొనసాగిస్తున్నామన్నారు. రూ.100 సభ్యత్వాన్ని తీసుకోవడం వల్ల రూ.5 లక్షల ప్రమాద బీమాతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తుండడంతో కుటుంబానికి భరోసా దొరుకుతోందన్నారు. 40 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన తెలుగుదేశం పార్టీ రాష్ట్రా భివృద్ధిలో ప్రత్యేక ముద్ర వేసిందన్నారు. కార్యక్రమంలో నరేష్, సురేంద్ర, సుధాకర్, రాజేం ద్ర, జయరాం, లక్ష్మీరెడ్డి, శ్రీనివాసులు, ప్రమీల, ఈశ్వరమ్మ, పద్మావతి పాల్గొన్నారు.

మహిళా ప్రీమియర్ లీగ్‌కు ఎన్.శ్రీచరణి ఎంపిక

ప్రజాశక్తి - కడప

మహిళా ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపిఎల్) ఆక్షన్‌లో కడపకు చెందిన క్రికెట్ క్రీడాకారిణి ఎన్. శ్రీ చరణి రూ. 55 లక్షలకు ఢిల్లీ క్యాపిటల్స్ టీముకు ఎంపికైంది. ఆమె ఉమెన్ ప్రీమియం లీగ్‌కు ఎంపిక కావడం పట్ల జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. భరత్‌రెడ్డి, జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్య దర్శి ఎ. రెడ్డిప్రసాద్, అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. శ్రీ చరణికి అభినందన శుభా కాంక్షలు తెలియజేశారు.



డాక్టరేట్ పట్టా అందుకుంటున్న పార్థసారథి

పార్థసారథికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి-పుల్లంపేట

పుల్లంపేట మండలం తిప్పాయపల్లి గ్రామానికి చెందిన కొమ్మ పార్థసారథికి తిరుపతిలోని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. ఫిజికల్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ ఎం.శివశంకర్‌రెడ్డి పర్యవేక్షణలో 'ఎఫెక్ట్ ఆఫ్ టు అండ్ సర్క్యూట్ ట్రైనింగ్ కంబైన్ విత్ హసనా అండ్ ప్రణామయ ప్రాక్టీస్ ఆన్ హెల్త్ అండ్ స్కిల్ రిలేటెడ్ ఫిట్నెస్ కాంపోనెంట్స్ ఆఫ్ స్కూల్ గర్ల్స్' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించగా పిహెచ్‌డి ప్రదా నం చేసినట్లు తెలిపారు. కొమ్మ పార్థసారథి వత్తలూరులోని జడ్‌పి హైస్కూ ల్‌లో ఎస్‌ఎ ఫిజికల్ సబ్జెక్టు బోధిస్తున్నారు. పార్థసారధికి డాక్టరేట్ ప్రదానం చేయడం పట విద్యాశాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యా యులు, ఉపాధ్యాయులు, సహచర ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలిపారు.

సంక్షేమ బోర్డు పునరుద్ధరణకు ఉద్యమిద్దాం

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు నిండినా ఇంతవరకు భవణ నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరిస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని సంక్షేమ బోర్డు పునరుద్ధరణకై ఐక్యంగా ఉద్యమిద్దామని ఎపి భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సలీంబాషా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బి.వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం బి.కొత్తకోటలో భవణ నిర్మాణ కార్మిక సంఘం తాపీ మేస్త్రీల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాల్సింది పోయి, సంక్షేమ బోర్డు రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి డిప్యూటీ సీఎం కోటి రూపాయలు బోర్డులో జమ చేస్తామని చెప్పిన హామీ ఆరు నెలలు కావస్తున్నా నేటికీ అమలు చేయలేదని ఆరోపించారు. పెండింగులో ఉన్న నిర్మాణ కార్మికుల క్లైములు పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తాపీ మేస్త్రి వర్కర్స్ యూనియన్ నాయకులు రామాంజనేయులు, ఆదినారాయణ, రమణ పాల్గొన్నారు.

ఎపి కోచ్, మేనేజర్‌గా గణేష్‌బాబు

ప్రజాశక్తి-నందలూరు



జాతీయస్థాయి సాఫ్ట్ టెన్నిస్ క్రీడా కోచ్, మేనేజర్‌గా టంగుటూరు జడ్‌పిహైస్కూల్ పీడీ పోలంకి గణేష్‌బాబును ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి కమిషనర్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు నియమించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం శ్రీనివాసులు మాట్లాడుతూ మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ (దేవాస్)లో ఈ నెల 18 నుంచి 26వ తేదీ వరకు జాతీయ స్థాయిలో అండర్-14, అండర్-17 అండర్-19 విభాగంలో సాఫ్ట్ టెన్నిస్ క్రీడ నిర్వహించడం జరుగు తుందని అన్నారు. ఈ పోటీలకు పోలంకి గణేష్ బాబును కోచ్, మేనేజర్‌గా ఎంపిక చేయడం విశేష మని అన్నారు. పాఠశాలలోని ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

బోధనేతర సిబ్బంది సంక్షేమమే ధ్యేయం

ప్రజాశక్తి-నందలూరు

మహాత్మ జ్యోతిరావుపూలే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బోధనేతర సిబ్బంది సంక్షేమమే తమ ధ్యేయమని ఆ సంఘం గౌరవ అధ్యక్షులు శివకాంత్, అధ్యక్షుడు మనోహర్ నాయుడు పేర్కొన్నారు. విజయవాడలో గల ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ఎన్జీవో హోం నందు మహాత్మ జ్యోతిరావుపూలే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల బోధనేతర సిబ్బంది సంఘం 6వ వార్షికోత్సవం వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. ఈ సమావేశానికి ఉమ్మడి కడప జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ ప్రశాంత్ హాజరయ్యి అప్కోస్ సిబ్బందికి మినిమం టైం స్కేల్, కాంట్రాక్టు బోధనేతర సిబ్బందిని రెగ్యులరైజేషన్ చేయమని కోరారు. ఇందుకు రాష్ట్ర గౌరవ అధ్యక్షులు శివకాంత్ స్పందించి గురుకుల రెగ్యులర్ ఉద్యోగులకు రిటైర్మెంట్ వయసును ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి 62 అమలయ్యేలా చూస్తామన్నారు. ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి కాంట్రాక్టు ఉద్యోగులను రెగులరైజేషన్, అప్కోస్ ఉద్యోగులకు మినిమం టైం స్కేల్స్ వర్తింపచేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ సంఘం ఎప్పుడు ఉద్యోగుల అభ్యున్నతికి పాటుపడుతుందని, ఎటువంటి ప్రలోభాలకు లొంగవద్దని అన్నారు. ముందు ఎపి జెఎసి, ఫెడరేషన్ ఆఫ్ గురుకుల రెసిడెన్షియల్ టీచర్ ఎంప్లాయీస్ ఆర్గనైజేషన్ లతో కలిసి బోధనేతర సిబ్బంది అభ్యున్నతికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ కృష్ణ మోహన్, ఎఫ్‌జిఆర్‌టి ఇఒ చైర్మన్ సల్మాన్‌రాజు, ఫెడరేషన్ ఆఫ్ గురుకుల రెసిడెన్షియల్ టీచర్ ఎంప్లాయీస్ ఆర్గనైజేషన్ హర్షవర్ధన్, ఎస్‌సి,ఎస్‌టి, మైనారిటీ అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నూకరాజు, ఎపిఆర్‌ఇఐ ఎస్ నాన్ టీచింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ హరి కృష్ణ, గురునాథం,కో చైర్మన్ నాగభూషణం, కడప జిల్లా నుంచి ట్రెజరర్ నాగభూషణం, అశోక్ రాష్ట్ర నలుమూలల నుంచి రెగ్యులర్, కాంట్రాక్టు, అప్కాస్ సిబ్బంది పాల్గొన్నారు.

చేనేతలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలి


ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం మూడు సెంట్లు ఇంటి స్థలాలు మంజూరు చేసి, ఇంటి నిర్మాణానికి రూ.5లక్షలు రుణ సదుపాయం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వీరణాల శివనారాయణ కోరారు. స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. గతంలో జగన్ ప్రభుత్వం 1.50 సెంట్లు స్థలం కేటాయించిందన్నారు. ఇది ఏమాత్రం సరిపోదన్నారు. ముఖ్యంగా చేనేతలు మగ్గం ఏర్పాటు చేసుకోవడానికి 1.50 సెంట్లు స్థలం ఎటూ సరిపోలేదని వివరించారు. ఆ చిన్న స్థలంలో మగ్గం, కుటుంబం ఎలా జీవిస్తారని ఆయన పేర్కొన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.1లక్షా 80వేలు మాత్రమే ఇచ్చిందని, సరిపోక లబ్ధిదారులు అప్పుచేసి ఇంటిని నిర్మించుకున్నారని తెలిపారు. సమావేశంలో చేనేత కార్మిక సంఘం నాయకులు పల్లా లక్ష్మీనారాయణ, దాసు, రమణ పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతురాలికి ట్రైసైకిల్ అందజేత

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మదనపల్లె పట్టణం, గాంధీపురంలో నివాసమున్న విభిన్న ప్రతిభావంతురాలు కృష్ణవేణికి ఆదివారం హెల్పింగ్ మైండ్స్ ట్రైసైకిల్ ఆధ్వర్యంలో అందజేశారు. వయసు మళ్ళిన కృష్ణవేణి తల్లిదండ్రులు తమ కుమార్తె మొహంలో ఆనందం చూసి చాలా సంతోషించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ మైండ్స్ వ్యవస్థాపకుడు అబూబక్కర్ సిద్దిక్ మాట్లాడుతూ 11ఏళ్ల నుండి ఎన్నో సేవలు అందిస్తున్న హెల్పింగ్ మైండ్స్ సంస్థ కృష్ణవేణి నిస్సహాయతను తెలుసుకుందని అన్నారు. తమ సంస్థ సభ్యుల సహకారంతో ఆమెలో మనోధైర్యం నింపేలా చిరు కానుకగా ట్రై సైకిల్ అందించినట్లు తెలిపారు. తమ సంస్థ సేవలను మరింత స్ఫూర్తిదాయకంగా, ఆదర్శనీయంగా చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో హెల్పింగ్ మైండ్స్ సభ్యులు సునీల్, కిరణ్, దంపేట్ల శివ కుమార్, పురుషోత్తం, దినకర్ పాల్గొన్నారు.



కృష్ణవేణికి ట్రైసైకిల్ అందిస్తున్న హెల్పింగ్ మైండ్స్ సభ్యులు

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది



బి.కొత్తకోట : పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-వాల్మీకిపురం

అమరజీవి పొట్టి శ్రీరాములు, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ వర్ధంతిని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు, వల్లభాయ్ పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం జెవివి అధ్యక్షులు ప్రభుచరణ్ మాట్లాడుతూ తెలుగువారికి ప్రత్యేక రాష్ట్రం ఉండాలని 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలర్పించారన్నారు. పొట్టి శ్రీరాములు పోరాట ఫలితంగా 1953 నవంబరు 1న ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. నిజాం మెడలు వంచి హైదరాబాద్ సంస్థానాన్ని విముక్తం చేయడంతో పాటు 530కిపైగా సంస్థానాలను దేశంలో విలీనం చేసిన ఉక్కుమనిషి, భారతతొలి ఉపప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ కల్పన, ఉపాధ్యాయులు రామలక్ష్మమ్మ, రేఖ, గౌతమి, క్రిష్ణవేణి, శోభన, సత్యమ్మ, బేబిప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** తెలుగువారి ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిన శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతిని మండల కేంద్రం కొత్తకోటలోని పాఠశాలలోని ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఎఒ ఆనంద్, ఎంఇఒ కార్యాలయంలో ఎంఇఒ రెడ్డి శేఖర్, కస్తూరిబా గాంధీ బాలికా పాఠశాలలో ఎస్‌ఒ విశ్వలత, సిఆర్‌పి రమణ, విద్యార్థులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారికోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని 52 రోజులపాటు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ఆత్మార్పణ చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములుని కొనియాడారు. **పుల్లంపేట :** మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆదివారం ఎఒ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా పొట్టి శ్రీరాములు వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఏవో మాట్లా డుతూ తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి పొట్టి శ్రీరాములు అని పేర్కొన్నారు. ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణాలు అర్పించిన వ్యక్తి, తెలుగువారి హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన వ్యక్తి పొట్టి శ్రీరాములు పేర్కొన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి ముత్తయ్య, సీనియర్ సహాయకులు ప్రకాష్‌రాజు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** తెలుగుభాష మాట్లాడే వారి కోసం భాషా ప్రయుక్త రాష్ట్రం ఏర్పాటుకు 52 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రాణాలు అర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగధనుడని మదనపల్లె ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు ఓం ప్రకాష్ కితాబిచ్చారు. అమరజీవి వర్ధంతిని పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఇందులో భాగంగా శ్రీప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం నుండి వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు భాష మాట్లాడే వారికోసం ప్రత్యేక రాష్ట్రం కావాలని ఆమరణ నిరాహార దీక్ష చేపట్టి ఆత్మార్పణ గావించాడన్నారు. తద్వారా తెలుగువారి కోసం ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పొట్టి శ్రీరాములు ఆశయ సాధన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం చిత్తూరు బస్టాండు కూడలిలో ప్రజలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. **పీలేరు:** అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగ ఫలితమే ఆంధ్ర రాష్ట్ర అవతరణ అని మండల విద్యాశాఖ అధికారి వై. లోకేశ్వర్ రెడ్డి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఆదివారం పొట్టి శ్రీరాములు వర్ధంతి (ఆత్మా ర్పణ దినోత్సవం) కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఎంఇఒ మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర ఏర్పాటు కోసం పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ చేసిన మహనీయుడిని, తెలుగు రాష్ట్ర అవతరణకు ఆయన ఆద్యుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివారెడ్డి, అక్రంబాష, క్రిష్ణమూర్తి, సుధాకర, శ్రీరాములు, సిఆర్పిలు మురళీధర్ రాజు, అశోక్, నాగరాజ, సత్యనారాయణ పాల్గొన్నారు.



వాల్మీకిపురం: పొట్టి శ్రీరాములు, వల్లభాయ్‌పటేల్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న జెవివి అధ్యక్షులు, విద్యార్థులు

యుద్ధాలు వద్దు..భూమిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న సతీష్ కుమార్

ప్రజాశక్తి-రాయచోటి

హ్యూమానిటీరియన్స్ ఆఫ్ రాయచోటి వారిచే సేవ్ ఎర్త్ నో వార్ అనే అంశముపై సాయి శుభ కళ్యాణమండపంలో ఆదివారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. యుద్ధాలు వద్దు మానవాళి పరిరక్షణ, భూమిని కాపాడుకుందాం అని హ్యూమానిటీరియల్ ఆర్గనైజేషన్ యొక్క ఫౌండర్ లైన్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ భయ్యా రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ దేశాలు అన్ని కూడా ఆధిపత్యం కోరుతూ ఆయుధాలను అమ్ముకుంటూ యుద్ధాలను ప్రోత్సహిస్తూ మానవాళికి మనుగడను ముప్పు తెస్తున్నారని అన్నారు. ప్రతి పౌరుడు యుద్ధాలు నివారించాలని నినదించాలి పేర్కొన్నారు. కార్యక్రమంలో విఆర్ విద్యాసంస్థల అధినేత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ భూమిని కాపాడుకోవడం కోసం యుద్ధాలు నివారించేందుకు కృషి చేయాలి అని ప్రతి ఒక్కరూ ఈ అంశముపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. టీచర్స్ యూనియన్ నాయకుడు శ్రీనివాస్ రాజు మాట్లాడుతూ చిన్ననాటి నుంచి విద్యార్థి దశ నుంచే ప్రతి విద్యార్థి వాతావరణ పరిరక్షణ భూ పరిరక్షణ, యుద్ధాల నివారణ ఎలా అనే అంశాలపై గుర్తెరిగి భావితరాలకు ఆదర్శంగా నిలిచేందుకు కృషి చేయాలని అన్నారు. లయన్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈనెల 23న జరగబోయేటువంటి గొప్ప ర్యాలీని ఈ అంశంపై నిర్వహిం చాలని దీనికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. పట్టణంలోని పలు స్వచ్ఛంద ఆర్గనైజ్ సేవా సంస్థలు కులాలకతీతంగా అందరూ పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేట్ విద్యాసంస్థల అధినేతలు, ఔత్సాహికులు స్వచ్ఛంద సేవకులు, మానవతా వాదులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పీలేరు

ప్రజా రవాణా సంస్థ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని పీలేరు ఆర్‌టిసి డిపో ఎన్‌ఎంయుఎ గౌరవాధ్యక్షులు యల్లెల రెడ్డెప్పరెడ్డి తెలిపారు. పీలేరు ఆర్‌టిసి డిపో ఎన్‌ఎంయుఎ గౌరవ అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా ఆదివారం స్థానిక ఆర్‌టిసి డిపో ఆవరణలో ఎన్‌ఎంయుఎ జెండా ఆవిష్కరించి, ఉద్యోగ సంఘాల కూటమి కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిత్తూరు రోడ్డులోని షఫీ ప్యారడైజ్ కల్యాణ మండపంలో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల ఎన్‌ఎంయూ ఉద్యోగ కార్మిక సంఘాలు విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డెప్పరెడ్డి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం ఆర్‌టిసిని ప్రభుత్వంలో విలీనం చేశామని గొప్పలు చెప్పుకుంటూ ఆ తర్వాత కార్మికుల సమస్యలను గాలికి వదిలేసిందన్నారు. పీలేరు డిపో పరిధిలో ఎంతో కాలంగా అపరిష్కృతంగా ఉన్న కార్మికుల, ఉద్యోగుల ఇళ్ల పట్టాల మంజూరుకు ప్రయత్నం చేస్తానని అన్నారు. గౌరవాధ్యక్షులుగా ఎన్నికైన రెడ్డెప్పరెడ్డికి ఎన్‌ఎంయూఎ సంఘం రాష్ట్ర నాయకులు, మహిళ కార్మికులు శాలువాలు, గజమాలతో సత్కరించారు. డిపోలో పనిచేస్తున్న ఉద్యోగ, కార్మికులకు తెదేపా జాతీయనేత, ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి వారికి అండగా నిలుస్తూ, సంఘాలకు భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. టిఎన్‌టియుసి గౌరవాధ్యక్షులుగా టిడిపి మండల మాజీ అధ్యక్షులు నాగప్పగారి అమరనాథరెడ్డి బాధ్యతలు తీసుకున్నారు. ఎపిఎస్‌ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులుగా కొత్తపల్లె శ్రీనాథరెడ్డి, నారే సతీష్ రెడ్డిని నియమించారని తెలిపారు. 55 సంవత్సరాలు నిండిన వారికి ఒడి ఇప్పించుట గురించి, ఒటి డ్యూటీలు రద్దు గురించి ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు, లీవ్ ఎన్‌ఐక్యాష్మెంట్ ఇప్పించదానికి ఎమ్మెల్యే సహ కారంతో కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో మూడు జిల్లాల అధ్య క్షులు బిఎస్ బాబు, వేలు, ఎంఎన్ రావు, నాయకులు కార్మికులు పాల్గొన్నారు.



డిపో గౌరవాధ్యక్షులుగా ఎన్నికైన యల్లెల రెడ్డివ్వరెడ్డితో ఆర్‌టిసి ఉద్యోగులు

వరి ధాన్యానికి గిట్టుబాటు ధర వచ్చే వరకూ

నిల్వ చేయడమే శ్రేయస్కరం



చాపాడులో అందుబాటులో ఉన్న గౌడౌన్

ప్రజాశక్తి - చాపాడు

ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరి పంట ప్రస్తుతం నూర్పిడి దశలో ఉంది. వరి ధాన్యం ధరలు గతంలో కంటే చాలా అధ్వానంగా ఉన్నాయి. గత ఏడాది నూర్పిడి సమయానికి 8 బస్తాల (పుట్టి) ధర రూ.14 వేలకు పైగా ఉండేది. ప్రస్తుతం 8 బస్తాలు వరి ధాన్యం ధర రూ.12వేలు మాత్రమే. పాత వరి ధాన్యం (ఏడాది క్రితమివి) రూ.24 వేలకు పైగా ఉన్న ధరలు ఒక్కసారిగా రూ.20వేలకు పడిపోయింది. ప్రస్తుతం ధాన్యాన్ని అమ్మకాలు చేయాలనుకున్న రైతులకు ఏమాత్రం గిట్టుబాటు కాదు. ప్రభుత్వం గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసే ఏర్పాట్లు చేపట్టడం లేదు. కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం లేదు. ఈ పరిస్థితుల్లో రైతులు ధాన్యాన్ని నిలువచేసే ఆలోచనలో ఉన్నారు. చాలామంది రైతులు ధాన్యాన్ని గోడౌన్‌లో నిలువ ఉంచేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. చాపాడు వద్ద రైతులకు ప్రసన్న ఆంజనేయస్వామి గౌడౌన్, మైదుకూరు, దువ్వూరు వద్ద ఇతర గౌడౌన్‌లు అందుబాటులో ఉన్నాయి. ధాన్యాన్ని ఆరబెట్టుకోవడానికి, నిల్వ ఉంచేందుకు అవకాశం ఉంది. గౌడౌన్‌లో వరి ధాన్యం నిలువ ఉంచడం వల్ల గిటుబాటు ధర వచ్చేవరకు నిలువ ఉంచుకోవచ్చు. అంతేకాకుండా రైతు లకు ధాన్యంపై బ్యాంక్ రుణ సౌకర్యం కూడా ఉంది. ఈ నేపథ్యంలో రైతులు ధాన్యం అమ్మకాలకు ఆసక్తి తగ్గి, నిల్వకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు.

సుందర సమాజ నిర్మాణానికి ఎంపిజెలో చేరండి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

సుందర సమాజ నిర్మాణం కోసం మూమెంట్ ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె)లో చేరండని నాయకులు కోరారు. ఎంపిజె ఎపి ఆధ్వర్యంలో ఈనెల 15 నుండి 31వతేదీ వరకు జాయిన్ ఎంపిజె ఉద్యమ పోస్టర్స్‌ను ఆదివారం ఆవిష్కరించారు. స్థానిక ఎస్‌ఆర్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా జమాతే ఇస్లామి హింద్ రాష్ట్ర అధ్యక్షులు మహమ్మద్ రఫీ, కార్యదర్శి గౌస్మహిద్ది, ఎస్పైఒ జాతీయ అధ్యక్షులు బ్రదర్ అబ్దుల్ హఫీజ్, రాష్ట్ర కార్యదర్శి సలీం గోడపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎంపిజె ఆశయాలు, లక్ష్యాలు, భావాలకు దగ్గరగా ఉండే వ్యక్తులు శాంతి స్థాపన కోసం చేరవచ్చు అన్నారు. దేశంలోని వివిధ మతాల మధ్య సోదర భావం నెలకొల్పడం ఎంపిజె లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కడప జిల్లా అధ్యక్షుడు జాకీర్ హుమ్రి, ఉపాధ్యక్షుడు నజీర్ అహ్మద్, కార్యదర్శి మహమ్మద్ రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం, కోశాధికారి ఇస్మాయిల్, సభ్యులు ముత్యార్ పాల్గొన్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు

ప్రజాశక్తి-రామాపురం

మండలంలోని చిట్లూరు పంచాయతీ మాలపల్లికు పక్కనే ఉన్న చెరువు అలుగు దగ్గర పడాని 11 కెవి విద్యుత్ తీగలు గల విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. చెరువు ఆయకట్టు దారులు, రైతులు ఈ దారి వెంబడే పంట పొలాలకు వెళ్ళవ లసి ఉండటంతో పెద్ద గాలివాన వచ్చిందంటే కరెంటు స్తంభాలు విరిగి పడే ప్రమా దం ఉందని భయాందోళన చెందుతున్నారు. ప్రమాదము సంభవించక మునుపే అధికారులు స్పందించి విద్యుత్ స్తంభాలకు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరు తున్నారు.



రైతు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జయచంద్రారెడ్డి

రైతు కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి-ములకలచెరువు

అప్పులు బాధతో ఆత్మహత్యకు పాల్పడిన రైతు కుటుంబాన్ని ఆదివారం తంబలపల్లి టిడిపి ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి పరామర్శించారు. మొలకలచెరువు మండలం, వేపూరికోట గ్రామానికి చెందిన యువరైతు బయ్యారెడ్డి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈనెల 13న భయ్యా రెడ్డి వ్యవసాయానికి చేసిన అప్పులు తీర్చలేక ఆత్మహత్యకు పాల్పడ్డారు. జయచంద్రారెడ్డి చీకుచెట్టుపల్లికి వచ్చి ఆత్మహత్య చేసుకున్న రైతు బయ్యారెడ్డి భార్య మల్లిక, కుమార్తెలు సింధు, తేజశ్రీలను పరామర్శించి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. భయ్యా రెడ్డి కుమార్తెల ఫీజును తాను చెల్లిస్తానని వారి ఇంటి వద్ద నుంచి కళాశాల యజమాన్యం వారికి మాట్లాడి చెప్పారు. ఇతరత్రా వ్యవసాయానికి కుటుంబ పోషణకు చేసిన అప్పుల వివరాలను వారి కుటుంబీకుల వద్ద నుంచి తెలుసుకున్నారు. జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వం నుంచి సాయం అందేలా బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వారిలో నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ సీడ్ మల్లికార్జున నాయుడు, మార్కిరిఆంజనేయరెడ్డి, వేపూరుకోట ఎంపిటిసి శ్రీనివాసులురెడ్డి, మాజీ ఎంపిటిసిలు మూగి రవిచంద్ర, శేషారెడ్డి . టిడిపి గ్రామ కమిటీ మాజీ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నాణ్యమైన మాంసాన్ని అమ్మాలి

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

నాణ్యమైన మాంసాన్ని అమ్మాలని, ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర పేర్కొన్నారు. పట్టణంలోని మటన్, చికెన్, చేపల దుకాణాలను ఆదివారం రాఘవేంద్ర, మున్సిపల్ సిబ్బంది తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యులచే పరీక్షించిన జీవాల మాంసాన్ని మాత్రమే అమ్మాల న్నారు. పలు దుకాణాలపై తనిఖీలు నిర్వహించి ప్రభుత్వ నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులను స్వాదీనం చేసుకున్నామన్నారు. ప్లాస్టిక్ కవర్లు, క్యారీ బ్యాగుల అమ్మే దుకాణాల లైసెన్సులు రద్దు చేయడమేకాక చట్టపరమైన చర్యలు తీసుకుంటామని రాఘవేంద్ర తెలిపారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్ : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన నృత్య ప్రదర్శనలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. రామమోహన్, లక్ష్మీ శ్రీనివాస జ్యువెలర్స్ పులివెందుల వారి సౌజన్యంతో నాట్యాచర్యులు డాక్టర్ ఆర్.మానస నృత్య కళాకేంద్రం, ధర్మవరం వారి చిన్నారులచే నిర్వహించిన ప్రేక్షకులను అలరించాయి. ప్రేక్షకులు చిన్నారులను కరతాళ ధ్వనులతో ప్రోత్సహించి అభినందించారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి సుధాకర్, నృత్య శిక్షకురాలు డాక్టర్ ఆర్.మానస, మాస్టర్ చందు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

కూటమి ప్రభుత్వంపై రైతుల్లో వ్యతిరేకత ఉందని, అందుకే సాగునీటి ఎన్నికలు సజావుగా జరగకుండా చేశారని వైసిపి ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం సాగునీటి సంఘాల ఎన్నికల్లో గెలిచిన అధ్యక్ష, ఉపాధ్యక్షులు, టిసిలతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఆర్ మాట్లాడుతూ రైతులు స్వేచ్ఛగా పాల్గొ నేందుకు అవకాశం లేకుండా కూటమి నాయకులు ప్రభుత్వ అధికారులచే నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా చేశారన్నారు. రైతుల్లో వ్యతిరేకత ఉందని గ్రహించి సర్టిఫికెట్ ఇవ్వకుండా చేశారన్నారు. పెద్దముడియం మండలంలో 16 మంది ఎన్నికలలో పోటీ చేస్తే 15 మంది గెలిచారన్నారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా కూటమి ప్రభుత్వం మూల్యం చెల్లించుకుంటుందన్నారు. సజావుగా ఎన్నికలు జరిగేందుకు కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు నీటి సంఘం ఎన్నికలు పూర్తి వ్యతిరేకమన్నారు. ముఖ్యమంత్రి కిందిస్థాయిలో కూటమి నాయ కులు చేసే విషయాలను గమనించాలన్నారు. కార్యక్రమంలో ఉప్పలపాడు శ్రీనివాసులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముల్లా జానీ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

అనారోగ్యంతో ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధితుని కథనం మేరకు.. తంబళ్లపల్లె మండలం, కోటకొండ వడ్డిపల్లికి చెందిన హరిబాబు(26) గత కొంతకాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడు తున్నాడు. పలు ఆస్పత్రులలో చూపించుకున్నా మందులు వాడినా తాత్కాలిక ఉపశమనం తప్ప జబ్బు నయం కాలేదు. ఆదివారం కడుపు నొప్పి తీవ్రత అధికం కావడంతో భరించలేక ఇంట్లో ఉన్న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు బాధితుడిని 108 లో మదనపల్లె ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు.

ఆన్‌లైన్ బెట్టింగులకు బలైన డ్రైవర్

-ఇంట్లోనే ఉరి వేసుకుని బలవన్మరణం

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

ఆన్‌లైన్ బెట్టింగులకు బొలేరో డ్రైవర్ బలయ్యాడు. ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణం చెందాడు. తంబళ్లపల్లె మండలంలో ఆదివారం ఉదయం వెలుగు చూసిన విషాదకర ఘటనపై మృతిని కుటుంబీకుల కథనం మేరకు.. కొటాల పంచాయితీ, ఎగువ బోయపల్లికి చెందిన నరసింహులు కొడుకు మహేష్28, టెంపో డ్రైవర్‌గా పని చేస్తున్నాడని తెలిపారు. కొంతకాలంగా ఆన్‌లైన్ గేమ్ ఆడి సుమారు రూ.15లక్షలు పోగొట్టుకున్నట్లు తెలిపారు. స్థానికంగా చేసిన అప్పులు తీర్చలేక ఇంట్లోనే ఉరి వేసుకుని మృతి చెందాడని తెలిపారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.